# తెలుగులో కథలు వ్రాసేవారు

రచయిత:

కృత్తివాస తీర్థులు

మన తెలుగుతల్లి నేటికి కథలువ్రాయడం కూడా ఒకకళఅని తెలుసుకొన్నది. కథ సారస్వతంలో ఒకశాఖక్రింద పరిణమించినది. కథవ్రాయడమే కాకుండా చెప్పడంకూడా కళే. అసలు కథఅంటే కథ్ = చెప్పు (వ్యక్తాయాం, వాచి) అనేదానిమీదనుంచి వచ్చింది. కథలు వ్రాసేవారు తెనుగులో లెక్కకు మిక్కుటంగావున్నారు. వారిలో చక్కగా వ్రాసేవారిసంఖ్య అల్పము. ఈకథల్లో జాతి జీవనము, సంఘజీవనము, ప్రేమ, మానవహృదయము, దేశభక్తి మొదలైన విషయాలు ఉంటున్నవి. చక్కగావ్రాసేవారి రచనలలో పరువమూ మెత్తదనమూ వున్నవి. ముఖ్యంగా కథల్లో అమృతమువంటి సజీవమైన వ్యావహారికాంధ్రము ఉపయోగింపబడుతూనేవుంది.

ఇక రెండో విషయం. అనుకరణాలు, అనువాదాలు, ఛాయలబాపతు. ఒకమంచికథ ఎవరైనా వ్రాసివుంటే ఆకథనే వస్తువుగా గ్రహించి, కించిత్తు మార్పులతోనో లేకపోతే ఆవిషయాన్నే తీసుకుని ఫొటోలు తీసినట్టు కథలు వ్రాస్తారు కొందరు. అలాగ కొన్నివందలూ వేలూ వున్నాయి కథలసరకు. అంతా చెత్త. భాషకుగాని భావోన్నతికిగాని రవ్వంతకూడా తోడ్పడకుండా వుంటున్నాయి. ఆచెత్తకథల్లో విషయం ఉదాత్తంకాదు, వ్యక్తీకరణలోకుంటూ, ట్రీట్మెంటులో చేతకానితనం వుంటున్నాయి. కొన్ని కథల్లో అసందర్భంగా అర్థయుక్తముకాని మోటుహాస్యం ఉపయోగింపబడుతూవున్నది. హాస్యం నర్మగర్భంగా పెద్దమనిషితరహాగా ఉండాలి. ఇప్పుడు ప్రతివారికీ బూతులో హాస్యం కనిపించింది. ఆశ్చర్యం! హాస్యరసప్రధానాలైన కథల్లో మోటుహాస్యం కనపడుతూవుంది. అటువంటి రచన సంఘజీవనానికి సంఘాభ్యుదయానికీ ఏమీ తోడ్పడదు. కథల్లో వెర్రిగా ప్రబంధాలును మించిపోయిన పచ్చి శృంగారం అసభ్యతతో, అనౌచిత్యంతో ఉంటూవున్నది. ఇలాంటి తుక్కుకథలు హాస్యపు పత్రికలనే పేరుతో ప్రకటింపబడే వాటిల్లో దిగుమతి అవుతాయి. స్వారస్య నిర్ణాయకులు ఎవ్వరూ వీటిని అభిమానించరు, ఆదరించరు. పాఠకులు కథలమాట అలావుంచి మంచివాని విషయం జాగ్రత్తగా విమర్శనాదృష్టితో పరిశీలనచేదాం.

చింతా దీక్షితులు.

నేటి కథకులలో శ్రీచింతా దీక్షితులుగారు ఉత్తమశ్రేణికి చెందినవారు. వీరికథలు సాహితీపత్రికాముఖంగా ఆంధ్రలోకానికి అందచేశారు. కథలలో మార్దవం సహజత్వం కనిపిస్తుంది. బాలుర మానసికప్రవృత్తులు ఎంతో రమ్యంగా చిత్రించగల ఎమరుతిరిగిన అనుభవంగలచెయ్యి. ఎక్స్ప్రెషన్ చాలాక్లు

ష్టంగా చక్కగా అర్థవంతంగా నాజూకుగా వుంటుంది సహృదయులహృదయాలను వీరికథలుచూరగొంటాయి. 'ఏకాదశి' అనే పదకొండుకథలు పుస్తకరూపంలో వేశారు. ప్రతి కథాకూడా వకకళాఖండ మన్నమాట.శివశంకరశాస్త్రిగారు అన్నట్లు వీరు నిజంగా 'కథకచక్రవర్తి'లు. ప్రతికథకూడా ఒక ప్రత్యేక సాధనవంటిది. దీక్షితులుగారు వ్యుత్పన్నుడు. ఆంధ్రవాఙ్మయంలో వీరికి మంచి స్థానం వున్నది. 'తాట్లివనంలో' 'చెంచుదంపతులు' అనే రెండు అద్భుతమైనరచనలు అద్భుతమైన వారికృషి. 'సఖి' ఆపంట నోచుకొన్నది. ఆంధ్రపత్రికలు చాలామంది ఆనందించారు. వీరు చాలాకథలు వ్రాశారు. అముద్రితాలు చాలా వున్నాయి.

మొక్కపాటి నరసింహశాస్త్రి.

ఉత్తమశ్రేణిలో చెందినవారు, ఆంధ్రులకు హాస్యరసభరితమైన నవలను, కథలనూ వ్రాయడంవల్ల చిరపరిచితులైనారు శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రిగారు. వీరి 'బారిష్టరు పార్వతీశం' ఒక ప్రత్యేకవక్తి ఆంధ్రులలో. అందరికీ నవ్వుపుట్టిస్తూ వుంటాడు. వీరు కథలు అసంఖ్యాకములు వ్రాయకపోయినా వ్రాసినకొద్దీకూడా చాలా విలువైనవి.కథలు వ్రాయడంలో దక్షత గోచరిస్తుంది. మానసికప్రవృత్తిని చక్కని తూలికతో కథలలో చిత్రిస్తారు. అయితే అక్కడక్కడ వర్ణనలు సందర్భశుద్ధితోవున్నా, కొంత ప్రాచీనంగా కనబడతాయి. సఖపత్రికా ముఖంగా 'చిత్తరువు' 'శిల్పిద్వయం' ఆంధ్రులకు అందినవి. కథానకములను ప్రతిబింబములనే పేరుతో ముద్రించారు. అన్నికథలూ ఒకసారి చదివిన తరువాత మళ్ళీ చదువవలెనని అనిపిస్తుంది. శైలి మనోహరంగావుంటుంది. చిన్న పిల్లలు చదువుతున్నా అర్థమయ్యే తేటతెలుగులో వుంటుంది రచన. వారినవలలు రెండూ ఇందుకు ఉదాహరణ. (పార్వతీశం, ఏకోదరులు) రసవ్యక్తీకరణ బాగాచేయగలరు. ఏకోదరులు అనే పెద్దకథలో (నవల అనినేను అనను దాన్ని) కరుణరసము చక్కగా వ్యక్తీకరించి పోషించారు. పాత్రపోషణ బాగావుంది. వీరి రచనలవల్ల కొంత నవీన ప్రాచీన సంప్రదాయాలను అనుసరిస్తారని తోస్తుంది. హిందూ మతంమీద విశ్వాసం దృఢంగా కనపడుతుంది. సంఘసంస్కారమంటే కొంచెంవప్పుకోనట్టు కనపడుతుంది. భారతిలో ముద్రితమైన 'న్యాయం' -'రంగగ్రామసింహారత్తయ్య' అనే కథలు వీరి అద్భుతఉపజ్ఞకు ఫలితాలు. 'న్యాయం' అనేకథవల్ల సామాన్య దరిద్రుణ్ణి ధనవంతుడు ఎలానీచంగా చూస్తాడో, ధనవంతుడిమాటనే లోకం విశ్వసిస్తుంది కాని బీదవాడిమాట లెక్క చెయ్యదనీ, న్యాయం అనేపేరుతో జరిగేదంతా అన్యాయమనీ, జాతివివక్షత వుంటున్నదనీ మొదలైన విషయాలన్నీ ద్యోతకమవుతాయి. రచనలో వైవిధ్యం వుండి ఆనందంకల్గిసుంది మన హృదయాలకు.

గుడిపాటి వెంకటచలము.

గుడిపాటి వెంకటాచలంగారు చాలా కథానకములు, నవలలు, నాటకములు వ్యాసములు సంఘమరమ్మతుకోసం వ్రాశారు. వీరి ఆశయాలు చాలా విపరీతంగా ; మామూలుగావుండే జనులకు కొంచెం తీవ్రంగా, తుపాకీపాట్లాగ చురుకుగా వుంటాయి. ఈయన వకప్రత్యేకవ్యక్తి. అంతా హేతువాదం మీద వుంటుంది ఈయనరచన. అందులో వకీలుకావడంవల్ల మరీ ఎక్కువ ఈహేతువాదం. సెక్సుప్రోబ్లెం గూర్చి ప్రత్యేకంగా చ

దివి కొంత లోకానుభవంవల్ల, కొంతస్వానుభవంవల్ల ఈ చెప్పబోయే విషయాలను కథరూపేణా వ్యక్తీకరిస్తారు. మన సంఘంలో స్త్రీలను ఎలా బానిసలువలె నీచంగా చూస్తారో, మనం అనుకొనే పతివ్రతలు పతివ్రతల్ కారని, ప్రాచీన సంప్రదాయాలు వినవద్దనీ, సంఘంలో వెర్రినమ్మకాలూ ఆచారాలూ చచ్చుమతం, పురుషుడికి వకనీతీ స్త్రీకి వకనీతీ ఏర్పాటుచేసిన చచ్చు న్యాయనమ్మసంఘం, వివాహంగూర్చిన అభిప్రాయం, స్త్రీస్వేచ్ఛ వివాహం జన్మాంతర సంబంధమూ, ఐహికాముష్మికాలకోసం ధర్మచరణకనీ పవిత్రమనీ అన్న అభిప్రాయంకాదని, మనం అనుకొనే నీతికి అసలు నీతికీ వ్యత్యాసం—ఈవిషయాలన్నీ వారు హేతువాదరీత్యా కథలలో వెలువరించారు. 'కన్నీటికాల్వ' 'దైవమిచ్చినభార్య' 'మాకర్మంఇలాకాలింది' 'శశిరేఖ' మొదలైన వందనూ చూచేవుంటారు. కథలు చాలా సెన్‌సేషనల్‌గా వుంటాయి. బలహీనుడి హృదయాన్ని వెంటనే లొంగదీసుకొంటాయి. కథలలో కొంత వైపరీత్యము, అనౌచితి, అసందర్భము కూడా కనపడుతుంది. 'ఆడాళ్ళగుట్టు బయటపడవేసి' దాహంతీరకుండా ఆమూలాగ్రం ప్రబంధకారుడిలాగ వర్ణిస్తారు. ఆర్టు కన్‌సీల్సు ఇన్ ఆర్టు.కళ నగ్నరూపంగా వుంటేనే కళ అవుతుంది. అంతేకాని నగ్నత పోయాక జుగుప్స కలుగుతుంది. అయితే వర్ణనలన్నీ కళ్ళకు కట్టినట్లు వుంటాయి. కథనడపడంలో నేర్పువున్నది. భాష కొంచెం వక్రగతికి పోతూవుంటుంది. శైలి సరళం ధారాళంగా వుంటుంది.

### మునిమాణిక్యం నరసింహారావు.

మునిమాణిక్యం నరసింహారావుగారి పేరు అందరికీ తెలిసేవుంటుంది. సంసారికకథలను అద్భుతంగా వ్రాస్తారు. కథలలో నర్మహాస్యం వుంటూవుంటుంది. 'వినోదిని, సాహితి, సఖి' మొదలైన చాలా పత్రికలలో వీరి కథలను చూస్తూవుంటాము. ఒక రిలాగన్నారు:'మీకథలు నన్ను గార్హస్థ్యాభిముఖంచేస్తున్నాయి' అని. అంతేచాలు వీరినిగూర్చి చెప్పడానికి. 'కాంతంకథలు', 'నేనూ మాకాంతం' వీరి ఉపజ్ఞకు ఫలితాలు. 'కాంతం' సామాన్య ఆంధ్రుల ఇళ్ళలో వుంటూనేవుంటుంది. కాంతాన్ని చక్కగా పోషించారు మునిమాణిక్యంగారు. ఎలాగయితేనేం కాంతం కాటుక్కాయ కావ్యగోష్ఠిలోకి వచ్చింది.

### శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ప్రబుద్ధాంధ్రపత్రికా సంపాదకులు. రాష్ట్రభక్తి, జాత్యభిమానంకలవారు. భాషదాస్యానికి ఏమీ వప్పుకోని ప్రత్యేకవ్యక్తులు. గొప్ప కథకులు. వీరికథలు సంఘజీవనాన్ని ముఖ్యంగా ఆంధ్రదేశీయుల ఆచారవ్యవహారాదులు చక్కగా చిత్రిస్తాయి. 'మావజ్జీవంహోష్యామి' 'కన్యాకాలేయత్నాద్వరితా' వీరి ప్రత్యేకకృషి. భాష కోనసీమ తెలుగు. కొంచెం మొక్కవయాస కనపడుతుంది. గుణవిషయం అయ్యాక అవగుణాలుకూడా చూతాం. ఇప్పుడిప్పుడు వ్రాసేకథలు నిండా సంభాషణ. సంభాషణకు కొన్నిహద్దులు, అవసరాలూ వున్నాయి. అది వారు గమనించి సంభాషణ నడిపించాలి. అయితే సంభాషణ నడిపించడంలో వీరికి పెట్టినపేరు. రచనలో వైవిధ్యంలేదు. ఎంతసేపటికీ తెలుగుదేశపు వితంతువు—ఎవరో దానిమీద కన్ను వేసిన పెద్దమనిషి—మధ్యపిట్టగోడ—ఇక కథనడుస్తుంది. ఫొటోగ్రాఫుల తీసినట్లు కొ

న్ని పుంజీలు కథలు వ్రాశారు, వెరైటీ లేకుండా. 'పూలదండ' మొదలైనవి చూడండి. వాసనచూడండి. వీరు నేరేషన్ కూడా ఉంచి వీలయినంతవరకు సంభాషణ తగ్గించి, ప్రొపోర్షన్ ఆలోచించి చూచుకొని మరీకథలు వ్రాయాలి. వెరైటీ ఉండితీరాలి. లేకపోతే అస్తమానం 'వితంతువు' కథావస్తువైతే తలనొప్పివేస్తుంది. అందువల్ల ఈవిషయాలు వారు గమనించి చక్కగా కథలు వ్రాస్తే నయం, అలా వ్రాయాలని మా అందరి కోరిక.

### కవికొండల వెంకటరావు.

ఇక కవికొండలవారు 'ఉదయని'లో వ్రాసిన కథ చక్కగావుంది. వీరు తమరచనలో మానవులనిరాడంబరజీవితము, కర్షకులు గ్రామజీవనము చక్కగా చిత్రిస్తారు.

### వేలూరి శివరామశాస్త్రి.

వేలూరి శివరామశాస్త్రిగారు వ్యుత్పన్నులు. కథకులు. పండితులు. వీరి రచనలో వెరైటీ ఎక్కువగా కనిపిస్తుంది. వాడుకభాషకు దగ్గరగావున్న గ్రాంధికంలో వ్రాస్తారు. కథలు బాగావ్రాస్తారు. 'ఓబయ్య' 'పిత్తల్ కాదర్బాజా' మొదలైనవి అంతా చదివేవుంటారు.

### తాతకృష్ణమూర్తి.

తాత కృష్ణమూర్తిగారు సంసారికకథలు వ్రాస్తారు. ముద్దుమూటలుకడుతూ వుంటాయి. 'రామప్రియ' అనే పుస్తకం రచించారు.

### ఇంకా కొంతమంది.

వెంపటి నాగభూషణంగారు, మల్లాది రామకృష్ణశాస్త్రిగారుకూడా ఒకమాదిరి మంచి కథలు వ్రాస్తారు.

స్త్రీలలో వ్రాసేవారు ఎక్కువమంది లేరు. కనుపర్తి వరలక్ష్మమ్మగారు నానావిషయాల మీద మెళుకువతో బుద్ధికుశలతతో సంఘానికి పనికివచ్చేకథలు వ్రాశారు. గుమ్మిడిదల దుర్గాబాయిగారు కథలు వ్రాస్తారుకాని అంతా హిందీనుంచిరవాణా.

ఇంకా కొంతమంది ఒకమాదిరి కథలు వ్రాస్తారు. వారిలో పూడిపెద్ది వెంకటరమణయ్య, చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాద్, కొడవటిగంటి కుటుంబరావు, బొడ్డు బాపిరాజు, 'గిరి', కృత్తివాస తీర్థులు, వఝ్ఝల కాళిదాసు, గూడూరి చలం, మల్లాది వెంకటకృష్ణశర్మ, మల్లాది అవధాని, ఏకుమళ్ళ కామేశ్వరరావు, జనమంచి కామేశ్వరరావు, ముద్దా విశ్వనాథం, కలగ సత్యనారాయణ, పురాణం కుమారరాఘవశాస్త్రి, కాళ్ళూరి రామారావు, క. గోపాలరావు, కపిల కాశీపతి, మొదలి సుబ్రహ్మణ్యశర్మ, మొదలి సీతారామస్వామి, రఘుపతిరావు, ఆచంట సూర్యనారాయణమూర్తి, సాంబమూర్తి, పమ్మి రామశాస్త్రి, ఇంద్రగంటివారు, కాంచనపల్లి రంగరావు, జానకిరామచౌదరి గార్లుకలరు.

మరొకవిషయం. నీతిబాహ్యమై సంఘగార్హ్యమునకు తోడ్పడే అసభ్యతతోకూడిన కథలు వ్రాయకూడదు. ఉన్నతభావములతో లక్ష్యశుద్ధితో చమత్కృతితో కథలు వ్రాస్తే సారస్వతములో స్థిరంగావుంటాయి. ప్రయోజనములేని కథలు వ్రాసి నిష్ప్రయోజనం. సారస్వతసేవ చేయ్యడానికి గద్యపద్యాదులతోపాటు కథలుకూడా చక్కగా రాయాలని రచయితలను కోరుతాం.